సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం, 1, మార్చి, 2025



'ఆఫ్‌టైప్' నష్టాన్ని పూడ్చేదెవరు?
ఆఫ్‌టైప్ ఆయిల్‌పామ్ మొక్కల సాగుతో నష్టపోయిన రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు.
8లో



విద్యార్థులపై శ్రద్ధ...
విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు.
8లో

గరిష్టం / కనిష్టం
36° / 20°
వాతావరణం
జిల్లాలో శనివారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉండవచ్చు.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూల మూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, పూజలు చేశారు

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈఓ సుదర్శన్ పాల్గొన్నారు.

మొదటి విడత తునికాకు టెండర్లు ఖరారు

పాల్వంచరూరల్: తునికాకు సేకరణ టెండర్లు ఎట్టకేలకు ఖరారయ్యాయి. ఈ ఏడాది తునికాకు సేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ గురు, శుక్రవారాల్లో మొదటి దఫాలో పలు యూనిట్లకు టెండర్లు ఖరారు చేసింది. రెండో విడత ఈ నెల 10,11 తేదీల్లో, మూడో విడత 20,21వ తేదీల్లో టెండర్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ డీఎం పృథ్వీరాజ్ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో 39 యూనిట్లలో గతేడాది కూడా ఆలస్యంగా టెండర్లు నిర్వహించారు. 35,100 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరణ లక్ష్యంగా నిర్దేశించగా, నాలుగో విడతలో పలువురు కాంట్రాక్టర్లు టెండర్లు ఖరారు చేసుకున్నారు. ఇక ఖమ్మం జిల్లాలోని ఐదు యూనిట్లు ఉండగా, ఒక్క యూనిట్‌పైనా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. దీంతో గతేడాది ఖమ్మం జిల్లాలో తునికాకు సేకరణ జరగలేదు.

ఆపదలో అండగా..



ఎస్‌ఎల్‌బీసీలో సహాయక చర్యలు చేపడుతున్న సింగరేణి రెస్క్యూ టీమ్, పర్యవేక్షిస్తున్న సీఎండీ బలరాం

విపత్కర పరిస్థితుల్లో ఆదుకుంటున్న సింగరేణి రెస్క్యూ బృందాలు
- నాలుగు రెస్క్యూ సెంటర్లు, 500 మందికి పైగా బ్రిగేడియర్లు
- ఎస్‌ఎల్‌బీసీ సహాయక చర్యల్లో 250 మంది సభ్యుల సేవలు
- తుపానులు, వరదలు, పర్వదినాల్లోనూ ప్రజాసేవకు సిద్ధం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదంలో బాధితులను కాపాడే రెస్క్యూ ఆపరేషన్‌లో సింగరేణి తన వంతు సాయం అందిస్తోంది. ప్రతి ఏటా గోదావరి వరదలు, మేడారం జాతర వంటి సందర్భాల్లోనూ సేవలందిస్తోంది. బొగ్గు తవ్వకాలు ప్రారంభించిన తర్వాత భూగర్భంలో నీటి ఊటలు రావడం, పైకప్పు కూలిపోవడం, విషవాయువులు లీక్ అవడం వంటి ప్రమాదాలు జరిగేవి. ఇలాంటి సందర్భాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై కార్మికులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తారు. అయినా ఊహించని ప్రమాదాల వల్ల గనుల్లో చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు సింగరేణి రెస్క్యూ టీమ్‌లను ఏర్పాటు చేసింది. అవసరమైన నైపుణ్య శిక్షణ ఇవ్వడంతోపాటు ఆధునిక పరికరాలను సమకూరుస్తోంది.

500 మందికి పైగా..
సింగరేణి సంస్థలో భూగర్భ గనుల్లో పని చేసే కార్మికుల్లో 21 నుంచి 30 ఏళ్లలోపు వయసు, ఫిజికల్ ఫిట్‌నెస్ ఉన్నవారు రెస్క్యూటీమ్‌లో చేరేందుకు అర్హులు. ఇలా ఎంపికైన వారికి రామగుండం రీజియన్ (గోదావరిఖని)లోని ప్రధాన రెస్క్యూ సెంటర్‌లో 14 రోజులపాటు శిక్షణ ఇస్తారు. తుపానులు, వరదలు, క్రౌడ్ మేనేజ్‌మెంట్, అగ్నిప్రమాదాలు, నిర్మాణాలు కూలిపోవడం, రోడ్డు ప్రమాదాలు తదితర విపత్కర పరిస్థితుల్లో సేవలు ఎలా అందివ్వాలనే అంశాలను శిక్షణలో నేర్పిస్తారు. ఆ తర్వాత సంస్థలోని మూడు ప్రధాన రీజియన్లలో ఉన్న కొత్తగూడెం, భూపాలపల్లి, మందమర్రి రెస్క్యూ సెంటర్లకు వీరిని కేటాయిస్తారు. ఇక్కడ ప్రతీనెల రీజినల్ రిఫ్రెష్ ట్రెనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తారు. రీజినల్ సెంటర్లలో షిఫ్టునకు ఐదుగురు బ్రిగేడియర్లు, ముగ్గురు శిక్షకులు.. ఎనిమిది మందితో కూడిన బృందం సిద్ధంగా ఉంటుంది. గోదావరిఖనిలో పద్దెనిమిది మందితో కూడిన మూడు బృందాలు అప్రమత్తంగా ఉంటాయి. సంస్థవ్యాప్తంగా 500 మందికి పైగా బ్రిగేడియర్లు ఆపదల్లో సాయం చేసేందుకు రెడీగా ఉన్నారు.

ఆధునిక పరికరాలు
రెస్క్యూ బృందానికి చెందిన బ్రిగేడియర్లు వరదలు, అగ్నిప్రమాదాలు, జనసమ్మర్థం తదితర సమయాల్లో ఎలా స్పందించాలనే అంశాలపై శిక్షణ పొందినా ఆధునిక పరికరాల సాయం లేకుంటే ఆ నైపుణ్యాలు అక్కరకు వచ్చేది అంతంతే. దీంతో రెస్క్యూ బృందాలకు ఆధునిక పరికరాలు సమకూర్చడంలో సింగరేణి శ్రద్ధ పెట్టింది. ప్రమాదాలు జరిగినప్పుడు పెద్ద బరువులు ఎత్తేందుకు వీలుగా హైడ్రాలిక్ లిఫ్టులతోపాటు గ్యాస్ కట్టర్లు, స్ప్రెడర్లు, రాక్‌డ్రిల్స్ తదితర పరికరాలు అందుబాటులో ఉంచింది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు కట్టర్లు, స్ప్రెడర్లు ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం ఎస్‌ఎల్‌బీసీ సహాయక చర్యల్లోనూ ఈ పరికరాలు ఉపయోగపడుతున్నాయి.

ఎస్‌ఎల్‌బీసీలో 250 మందితో..
ఎస్‌ఎల్‌బీసీ ఆపరేషన్‌లో సింగరేణి రెస్క్యూ బృందానికి చెందిన 250 మంది సభ్యులు గడిచిన రెండు రోజులుగా పాల్గొంటున్నారు. నాలుగు బృందాలుగా విడిపోయి 24 గంటలు సహాయక చర్యల్లో చెమటోడ్చుతున్నారు. టన్నెల్‌లో కూలిపోయిన బోరింగ్ మిషన్ భాగాలను గ్యాస్ కట్టర్ల సాయంతో తొలగిస్తున్నారు. టన్నెల్ ట్రాక్‌ను పునరుద్ధరించేందుకు అడ్డుగా ఉన్న గడ్డర్లు, ఇనుప పైపులను తొలగించే పనిలో శ్రమిస్తున్నారు. దీంతోపాటు బాధితులు ఉన్న ప్రదేశాలకు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు చేరుకునేందుకు వీలుగా జీపీఐ (గ్రౌండ్ పెనట్రేటింగ్ పరికరాలు) బిగించే పనిలో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలతో కలిసి పనిచేస్తున్నారు. సీఎండీ బలరాంనాయక్, జీఎం అక్కడే ఉండి రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు.

సామాజిక బాధ్యత
ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సామాజిక బాధ్యతగా సింగరేణి స్పందిస్తోంది. సుశిక్షితులైన సింగరేణి రెస్క్యూటీం బ్రిగేడియర్లు తక్షణమే రంగంలోకి దిగుతున్నారు. మేడారం జాతర, శ్రీరామనవమి, పుష్కరాలు వంటి పర్వదినాలు, తుపానులు, గోదావరి వరదలు వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మేమున్నామంటూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. దీంతో స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్‌ఎఫ్) సైతం ఆపత్కాలంలో సింగరేణి వైపు చూస్తోంది.

ఏసీబీకి చిక్కిన హెచ్‌ఎం

రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన రవీందర్



ఏసీబీకి పట్టుబడిన కూలీలైన్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రవీందర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ రమేష్ కథనం ప్రకారం.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కరాటే నేర్పేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పాఠశాలకు రూ.30 వేలు విడుదల చేస్తోంది. ఈ క్రమంలో కొత్తగూడెంలోని కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలకు రూ.30 వేలు విడుదల చేసింది. దీంతో ఓ శిక్షకుడి చేత విద్యార్థులకు కరాటే శిక్షణ ఇప్పిస్తున్నారు. శిక్షణ ఏప్రిల్‌తో ముగియనుంది. ఈ క్రమంలో కరాటే నేర్పించిన శిక్షకుడికి ఇప్పటికే రూ.10 వేలు చెల్లించారు. మిగతా రూ.20 వేలు తనకు ఇవ్వాలని పాఠశాల హెచ్‌ఎం తాటి రవీందర్ డిమాండ్ చేశారు. దీంతో శిక్షకుడు ఏసీబీకి సమాచారం అందించగా, వారు వలపన్ని హెచ్‌ఎంకు రూ.20 వేలు డబ్బులు ఇస్తుండగా పట్టుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. గత రెండు నెలల కాలంలో విద్యాశాఖలో ముగ్గురు అధికారులు ఏసీబీకి పట్టుబడటం గమనార్హం. కాగా కూలీలైన్ పాఠశాలలో రెండు నెలలుగా గతంలో ఉన్న హెచ్‌ఎం, ప్రస్తుత హెచ్‌ఎం మధ్య వర్గపోరు జరుగుతోందని, పరస్పరం రాజకీయ ఒత్తిళ్లు తీసుకొస్తున్నారని, విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసుకున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

విద్యాశాఖపై అవినీతి మరకలు

పాల్వంచ: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వరుసగా అవినీతి నిరోధక శాఖకు చిక్కుతుండటం చర్చనీయాంశంగా మారుతోంది. విద్యాబుద్ధులు నేర్పే గురువులు లంచం తీసుకుంటూ విద్యార్థుల ఎదుటే అరెస్టై జైలుకు వెళ్తున్నారు. 2023 సెప్టెంబర్‌లో మధిర హెచ్‌ఎం మాతంగి శ్రీలత రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులకు బిల్లులు చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసి దొరికియారు. గత జనవరి 25న ఇల్లెందు ప్రభుత్వ మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ బి.కృష్ణ, ఆఫీస్ అటెండర్ కొచ్చెర్ల రామకృష్ణ రూ.2 వేలు లంచం తీసుకుంటు పట్టుబడ్డారు. కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులకు జీతాల బిల్లులు చేసేందుకు లంచం డిమాండ్ చేసి పట్టుబడ్డారు. తాజాగా కొత్తగూడెం కూలీలైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ ఏసీబీకి పట్టుబడ్డాడు. విద్యార్థులకు, సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయులు లంచావతారం ఎత్తుతుండటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక హాస్టళ్లలో కూడా హెచ్‌ఎంలు, వార్డెన్లు, అధికారులు మామూళ్లకు అలవాటుపడ్డారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజల్లో చైతన్యం వస్తోంది



అవినీతి అధికారులను పట్టించేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారు. ప్రజలు చైతన్యంతో ఏసీబీకి సమాచారం ఇవ్వడంతో వెంటనే రంగంలోకి దిగి పట్టుకుంటున్నాం. లంచం అడిగితే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు, 9154388981 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.
–వై.రమేష్, ఏసీబీ డీఎస్పీ

గని కార్మికులకు జడ్జి అభినందన



పీవీకే-5షాఫ్ట్ గని వద్ద న్యాయమూర్తి భానుమతి తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు వందల అడుగుల లోతులో పనిచేస్తూ, వేలాది పరిశ్రమలకు ఇంధనాన్ని అందిస్తున్నారని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.భానుమతి పేర్కొన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్నారని అభినందించారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5షాఫ్ట్ గనిని శుక్రవారం ఆమె సందర్శించారు. బొగ్గు గని కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కార్మికులు హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నిరంజన్ రావు, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు, సింగరేణి అధికారులు రవీందర్, శ్యాంప్రసాద్, షకీల్, హుమాయిన్, సీతారామ్, వి.కృష్ణవేణి, అనుపమ పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ల బాధ్యత కీలకం
కొత్తగూడెంఅర్బన్: పారాలీగల్ వలంటీర్ల బాధ్యత కీలకమని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. శుక్రవారం వలంటీర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వృద్ధాశ్రమం, మానసిక వికాస కేంద్రాల్లో సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నల్సా స్కీమ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, న్యాయవాదులు జి. రామచంద్రరెడ్డి, షాజహాన్ పర్వీన్, జి.సునంద, మెండు రాజమల్లు, పార్వతి, మహాలక్ష్మి, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాల వైపు పయనించాలి

ఎస్పీ రోహిత్‌రాజు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

దుమ్ముగూడెం : చదువుకుని గ్రామాల్లో ఉన్న యువత బయట ప్రపంచంలోకి వచ్చి, ఉన్నత శిఖరాల వైపు పయనించాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. ములకపాడు వైద్యశాల క్రీడా మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి వాలీబాల్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వాలీబాల్ పోటీలకు 54 గ్రామాల నుంచి టీంలు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. దుమ్ముగూడెం మండలంలో సుమారుగా రూ. 2 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి, మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని సూచించారు. ఆ తర్వాత పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. స్టేడియంలో సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ పరితోజ్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జునన్, సీఐ అశోక్, ఎస్‌ఐలు వెంకటప్పయ్య, పోటు గణేష్ పాల్గొన్నారు.

వ్యాయామం అవసరం
భద్రాచలంటౌన్: యువత శారీరక దృఢత్వం కోసం రోజూ వ్యాయామం చేయాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. పట్టణంలోని టెంపుల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. సీఐ రమేష్, ఎస్‌ఐ మధు ప్రసాద్ పాల్గొన్నారు.

వృత్తివిద్యపై దృష్టి సారించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

పాల్వంచ: యువత వృత్తి విద్యా కోర్సులపై దృష్టి సారించాలని, మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. నవలిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒకేషనల్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూషన్, మహిళా సాధికార కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించి మాట్లాడారు. వృత్తి విద్యా కోర్సులు నేర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. నవ లిమిటెడ్ అధికారులు ఎంజీఎం.ప్రసాద్, సంజీవ రావు, ఖాదారేంద్ర బాబు, సాంబశివరావు, శ్రీనివాసరావు, యుఎస్‌ఎన్.శర్మ పాల్గొన్నారు.

జాగా కొలిచేదెట్లా?

ఉమ్మడి జిల్లాలో భూ సర్వే సమస్యలు పేరుకుపోతున్నాయి. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి వ్యవస్థతో హద్దులు, కొలతలకు సంబంధించిన అర్జీలు కూడా పెరిగిపోతున్నాయి. చాలా సర్వే నంబర్లలో భూ వివాదాలు నెలకొన్నాయి. మరోవైపు కొలత వేసి హద్దులు నిర్ధారించే, మ్యాపులు అందించే సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలో ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్, చైన్‌మన్లు ఇతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఉన్నవారు పని ఒత్తిడిని ఎదుర్కోవాల్సివస్తోంది. –పాల్వంచరూరల్



సర్వే చేయాల్సిన భూమి

- ల్యాండ్ రికార్డ్స్ అండ్ సర్వే విభాగంలో సిబ్బంది కొరత
- రెండు సర్వేయర్, 19 డిప్యూటీ సర్వేయర్ పోస్టులు ఖాళీ
- ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో 445 దరఖాస్తులు
- ఏళ్లు గడుస్తున్నా హద్దులు, కొలతలు తేలని భూ వివాదాలు

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వేయర్, డిప్యూటీ సర్వేయర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, చైన్‌మన్ తదితర 18 రకాల పోస్టులు ఉంటాయి. పెరుగుతున్న అవసరాల రీత్యా అదనపు పోస్టులను మంజూరు చేయకపోగా ప్రభుత్వం ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయడం లేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 114 పోస్టులు ఉండగా, ప్రస్తుతం 74 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇంకా 40 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో కీలకమైన డిప్యూటీ సర్వేయర్ పోస్టులు 19 ఖాళీగా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సర్వేయర్ 11, చైన్ మన్ పోస్టులు 3, ఇతర సిబ్బంది 9 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. భద్రాద్రి జిల్లాలో సర్వే ఇన్‌స్పెక్టర్ 1, సర్వేయర్ 2, డిప్యూటీ సర్వేయర్ 8, చైన్‌మన్ 1, ఇతర సిబ్బంది ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అనేక మండలాల్లో అధికారుల కొరత ఉండటంతో ఇతర మండలాల వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో పనిభారం పెరిగి భూముల హద్దుల గుర్తింపు అర్జీలు పరిష్కరించలేకపోతున్నారు. ఫలితంగా భూ సర్వే కోసం దరఖాస్తుదారులు ఏళ్లతరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దశాబ్దాల నాటి రికార్డుల ప్రకారమే సర్వే చేయాల్సి వస్తుండగా, ఏళ్లు గడుస్తున్నా భూ హద్దుల వివాదం తేలడంలేదు. సరైన హద్దు రాళ్లులేక సర్కారు భూములు, బఫర్ జోన్, చెరువు శిఖం వంటివి ఆక్రమణకు గురవుతున్నాయి.

45 రోజుల్లో పరిష్కరించాల్సి ఉన్నా...
భూ పంపకాలు, భూ యజమానుల మధ్య గట్టు వివాదాలు తలెత్తినా, క్రయ, విక్రయాల సమయంలో సర్వే కోసం దరఖాస్తు చేసుకుంటారు. నిబంధనల ప్రకారం సర్వే దరఖాస్తులను తహసీల్దార్లు పరిశీలించి 45 రోజుల్లో పరిష్కరించాల్సి ఉంటుంది. సర్వేయర్లతో భూ కొలతలు తీసుకుని దరఖాస్తుదారుడికి నివేదికలు అందించాల్సి ఉంటుంది. కానీ సర్వేయర్, డిప్యూటీ సర్వేయర్ల కొరత కారణంగా భూ కొలతలు ఎప్పుడు చేపడతారో తెలియని పరిస్థితి నెలకొంది.

రీ సర్వే జరగక సమస్యలు జటిలం..
జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, అటవీ ఇతర భూముల్లో రీ సర్వే జరగకపోవంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అనేక చోట్ల స్పష్టమైన హద్దుల్లేక అనుభవదారుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. గ్రీవెన్స్‌డేతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో వీటికి సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దృష్టి సారించి సర్వేశాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, అవసరమైన అదనపు పోస్టులను మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో పోస్టుల వివరాలు..

జిల్లా	మొత్తం పోస్టులు	పనిచేస్తున్న సిబ్బంది	ఖాళీలు
ఖమ్మం	62	39	23
భద్రాద్రి	52	35	17
మొత్తం	114	74	40

అదనపు పోస్టులేవి..?
నూతన జిల్లాల ఏర్పాటు తర్వాత నూతన పోస్టులు మంజూరు కాలేదు. ఖాళీలూ భర్తీ చేయలేదు. దీంతో భద్రాద్రి జిల్లా ఏడీగా ఖమ్మం జిల్లా ఏడీ శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టం అమల్లోకి వస్తే భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు భూ పటం(నక్ష) తప్పనిసరి అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డిప్యూటీ సర్వేయర్ల పోస్టుల్లో పూర్వ వీఆర్వో, వీఆర్‌ఏల్లో ఆసక్తి కలిగిన వారిని నియమించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఖాళీ పోస్టుల భర్తీపై భూమి కొలతలు, రికార్డుల నిర్వహణ శాఖ ఏడీ శ్రీనివాస్‌రావును వివరణ కోరగా.. సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు, ఇతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని తెలిపారు. భూ సర్వే శాఖ పునర్ వ్యవస్థీకరణపై ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు.

దరఖాస్తుల వివరాలు ఇలా..
భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 2016 నుంచి ఇప్పటివరకు భూ కొలతల కోసం 7,123 దరఖాస్తులు అందాయి. ఇందులో 5,311 దరఖాస్తులను తిరస్కరించారు. 76 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 21 మండలాల నుంచి 2021 నుంచి ఇప్పటివరకు 13,726 దరఖాస్తులు రాగా, వీటిలో 6,354 దరఖాస్తులను తిరస్కరించారు. మరో 369 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన అర్జీలను పరిష్కరించారు.

ప్రజాభిమానం చూరగొనాలి..

ములకలపల్లి: ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రజాభిమానం చూరగొనాలని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి సూచించారు. ములకలపల్లి ఎంపీఓ ధనసరి లక్ష్మయ్య ఉద్యోగ విరమణ పొందగా, రైతువేదికలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ లక్ష్మయ్య అంకితభావంతో విధులు నిర్వర్తించారని పేర్కొన్నారు. ఎంపీడీఓ జి.రేవతి, డీటీ భాగ్యలక్ష్మి, ఆర్‌ఐ భద్రు, తాండ్ర ప్రభాకర్‌రావు, కారం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామాలయానికి రూ.4 లక్షల విరాళం

అశ్వాపురం: మండలంలోని మొండికుంటలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 4 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు మొదలుకానున్నాయి. ఈ సందర్భంగా ఆలయం మూలనిధికి గ్రామానికి చెందిన కందాల వెంకటరెడ్డి కుమార్తె ముద్దం చంద్రకళ–లచ్చిరెడ్డి దంపతులు శుక్రవారం రూ.4 లక్షల విరాళం అందజేశారు. గతంలోనూ ఈ దంపతులు రూ.6 లక్షలతో మకరతోరణం, శ్రీచక్రం, ఆకాశదీపాలు అందజేయడమే కాక ఆలయ ప్రాంగణానికి కావాల్సిన గ్రానైట్ రాయి సమకూర్చారు. ఈ సందర్భంగా చంద్రకళ – లచ్చిరెడ్డి కుటుంబీకులకు ఆలయ నిర్మాణ, ప్రతిష్ఠాపన కమిటీల బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శుక్రవారం భక్తులు విరాళం అందజేశారు. ఖమ్మం శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన మునుసూరి రామారావు – విజయకుమారి దంపతులు రూ.1,00,116 చెక్కును ఆలయ అధికారులకు అందజేశాక స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగి సాయిబాబు పాల్గొన్నారు.

టెన్నిస్ టోర్నీ సింగిల్స్ విజేత అధర్వశర్మ



ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచిన శర్మ (ఎడమ), జయప్రకాష్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో వారం రోజులుగా కొనసాగుతున్న టెన్నిస్ టోర్నీలో సింగిల్స్ విజేతగా అధర్వశర్మ(మహారాష్ట్ర) నిలిచాడు. చల్లపల్లి రాధమ్మ స్మారక టోర్నీలో భాగంగా సింగిల్స్ విభాగంలో శుక్రవారం ఫైనల్స్ నిర్వహించారు. ఇందులో అధర్వశర్మ, ఓగెస్ థేయ్జా జయప్రకాశ్(తమిళనాడు) తలపడగా 1–6, 6–3, 6–3 తేడాతో శర్మ టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఈమేరకు విజేతతో పాటు రన్నరప్‌కు వీవీసీ గ్రూప్ చైర్మన్ వీ.వీ.రాజేంద్రసాద్, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డితో పాటు చల్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ కాసాని అనిల్, కాంపాటి సత్యనారాయణ, మద్దినేని వెంకట్ ట్రోఫీలు అందజేశారు. అలాగే, మొదటి నాలుగుస్థానాల్లో నిలిచిన క్రీడాకారులు, డబుల్స్ విజేతలు, రన్నరప్‌కు కలిపి మొత్తంగా రూ.2.50లక్షల నగదు బహుమతి అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎఫ్‌బీఓపై దాడి..

ములకలపల్లి: ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ)పై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదైంది. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. పాల్వంచలోని నెహ్రూనగర్‌కు చెందిన తేజావత్ అనూష మండలంలోని ఒడ్డురామవరం ఎఫ్‌బీఓగా విధులు నిర్వహిస్తోంది. పూసుగూడెంనకు చెందిన భూక్యా నంద ఇంటి వద్ద టేకు కలప నిల్వ చేశారన్న సమాచారం మేరకు గురువారం సిబ్బందితో కలిసి దాడులు చేశారు. నంద భార్య సరిత, సోదరి సామిని ఎఫ్‌బీఓను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడికి పాల్పడ్డారు. తనిఖీల పేరుతో మరోమారు ఇంటికి వస్తే చంపుతామని బెదిరించారు. ఈ ఘటనపై ఎఫ్‌బీఓ అనూష శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దివ్యాంగుడి అదృశ్యం

పాల్వంచ: ఇంట్లో గొడవపడి దివ్యాంగుడు ఆరు రోజుల కిందట కనిపించకుండా వెళ్లిపోయాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఎస్.సామిత్ కుడికాలుకు పోలియో ఉంది. ఆరు రోజుల కిందట ఇంట్లోని సభ్యులతో గొడవ పడి వెళ్లిపోయాడు. అతని ఆచూకీ ఎక్కడా దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ గ్రామ పంచాయతీ కట్టుగూడెం గ్రామానికి చెందిన సునీల్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 21 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా మద్యం బాటిళ్లను నిల్వ చేసి, విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సునీల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ తెలిపారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.20,487

‘ఆఫ్‌టైప్‌’ నష్టాన్ని పూడ్చేదెవరు?

- నాణ్యతలేని ఆయిల్‌పామ్ మొక్కలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- నష్టపరిహారం కోసం ఎదురుచూపులు
- నిబంధనలు పాటించని అధికారులు
- స్పందించని ఆయిల్ ఫెడ్ యాజమాన్యం


దమ్మపేట: తెలంగాణ ఆయిల్ ఫెడ్ పరిధిలోని నర్సరీల్లో మొక్కల పెంపకంలో అధికారుల సరైన పర్యవేక్షణ, నిబంధనలు పాటించని కారణంగా పంపిణీ చేసిన ఆఫ్‌టైప్ పామాయిల్ మొక్కల సాగుతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. పరిహారం కోసం రైతులు ఎదురుచూస్తుండగా, ఆయిల్ ఫెడ్ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 89 వేల ఎకరాల విస్తీర్ణంలో పామాయిల్ పంటను సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు వేల సంఖ్యలో ఆఫ్‌టైప్ మొక్కలు రావడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు తమకు ఆఫ్‌టైప్ మొక్కలు వచ్చాయనే అవగాహన కూడా లేక వాటిని తొలగించి, కొత్త మొక్కలను నాటిన ఘటనలు అనేకం ఉన్నాయి. నర్సరీలో విత్తన దశ నుంచి మొక్కగా పెరుగుతున్నప్పుడే.. ఈ ఆఫ్‌టైప్, నాణ్యత లేని మొక్కలను గుర్తించలేకపోవడం, ఆయిల్ ఫెడ్ నర్సరీ అధికారుల అసమర్థతకు నిదర్శనమని రైతులు ఆరోపిస్తున్నారు. మొక్కల పెంపకానికి అవసరమైన విత్తనాల ఎంపికలో కూడా ఆయిల్ ఫెడ్ అధికారులు నిబంధనలను అతిక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ క్షేత్రాల్లో ఐదేళ్లపాటు సొంత పెట్టుబడితో మొక్కలను పెంచిన తర్వాత అవి ఆఫ్‌టైప్‌కి చెందినవని, వాటి వల్ల ఏమాత్రం దిగుబడి రాదని తెలియడంతో రైతులు నిర్ఘాంత పోయారు. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఆయిల్ ఫెడ్ ఉన్నతాధికారులను సంప్రదించినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. దీంతో పంట దిగుబడి రాని చెట్లను జేసీబీల సాయంతో పెకిలించారు.

నర్సరీలో మొక్కల పెంపకం

తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నర్సరీలో విత్తనాల నుంచి పామాయిల్ మొక్కలను పెంచుతారు. కోస్టారికా, ఇండోనేషియా, మలేషియా దేశాల నుంచి మేలు రకం విత్తనాలను తీసుకొచ్చి, వీటి ద్వారా



దమ్మపేట మండలం జగ్గారంలో ఆయిల్‌పామ్ మొక్కను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం



దిగుబడి లేని ఆఫ్‌టైప్ పామాయిల్ చెట్టు

మొక్కలను నాలుగు నెలల పాటు షేడ్ నెట్‌లో పెంచుతారు. ఈ మొక్కల పెంపకాన్ని ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించి, ఆయిల్ ఫెడ్ పరిధిలోని అధికారులు, సూపర్‌వైజర్ల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలి. అనంతరం ఎనిమిది నెలల పాటు బయట ప్రదేశంలో పెంచుతారు. మొక్కలు షేడ్ నెట్‌లో ఉండగానే ఎదుగుదలలో లోపాల ఆధారంగా, ఈ ఆఫ్‌టైప్, నాణ్యత లేని మొక్కలను ముందుగానే గుర్తించవచ్చు. కానీ అధికారులు ఈ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలుస్తోంది. ఆఫ్‌టైప్ మొక్కలను గుర్తించిన వెంటనే నిబంధనల ప్రకారం వాటిని నర్సరీ నుంచి తొలగించాలి. ఏడాదిపాటు మొక్కల పెంపకం పూర్తయిన అనంతరం, వాటిలో కొన్ని మొక్కలను నమూనాలుగా సేకరించి, నాణ్యత నిర్ధారణ కోసం ఏపీలోని ఏలూరు జిల్లా పెదవేగిలో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పామ్ రీసెర్చ్ సెంటర్‌కు పంపాలి. అక్కడ ఉద్యాన పంటల శాస్త్రవేత్తలు నాణ్యతను పరిశీలించి సాగుకు యోగ్యమైనవని నిర్ధారించిన తర్వాత మాత్రమే రైతులకు మొక్కలను పంపిణీ చేయాలి. కానీ, ఏనాడు మొక్కలను పరిశీలనకు పంపిన సందర్భాలే లేవని రైతులు చెబుతున్నారు.

నిబంధనల అతిక్రమణ

విత్తనాల ఎంపికలో ఆయిల్ ఫెడ్ అధికారుల నిబంధనల అతిక్రమణ, అసమర్థత కారణంగానే ఎక్కువ సంఖ్యలో ఆఫ్‌టైప్, నాణ్యతలేని మొక్కలు నర్సరీలో పెరిగాయనేది రైతుల ఆరోపణ. నర్సరీలోని షేడ్ నెట్‌లో ఉండగానే నాణ్యత లేని, ఆఫ్‌టైప్ మొక్కలను అధికారులు గుర్తించాలి. అశ్వారావుపేట డివిజన్ నర్సరీలో 2016 నుంచి 2024 వరకు పంపిణీ చేసిన మొక్కల్లో చాలావరకు నాణ్యతలేని, ఆఫ్‌టైప్ మొక్కలు ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. విత్తన కంపెనీలతో అధికారుల లోపాయికారీ ఒప్పందాలు, నాణ్యతలో రాజీపడి ఈ నాణ్యత లేని, ఆఫ్‌టైప్ మొక్కలను నర్సరీల్లో పెంచారని సమాచారం. ఆఫ్‌టైప్, నాణ్యత లేని మొక్కలతో కొంతమంది రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఎకరా విస్తీర్ణంలో 50 నుంచి 57 పామాయిల్ మొక్కలను సాగు చేస్తారు. వీటిల్లో ఒకటి లేదా రెండు మొక్కలు ఆఫ్‌టైప్ రావడం సాధారణమే. కానీ, ఎకరంలో ఐదు నుంచి ఇరవై వరకు ఆఫ్‌టైప్, కల్లింగ్ మొక్కలు రావడం చర్చనీయాంశంగా మారింది. ఐదేళ్ల పాటు మొక్కలను సాకిన తర్వాత అవి ఆఫ్‌టైప్ అని తెలియడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

పరిహారం చెల్లించాలి



ఆఫ్‌టైప్ మొక్కలతో నష్టపోయిన వారికి మొక్కల సంఖ్య ఆధారంగా పరిహారం చెల్లించాలి. పట్వారిగూడెం, జగ్గారంలో 30 ఎకరాల్లో 2016 – 17లో ఆయిల్ పామ్ సాగు ప్రారంభించా. అందులో 150 ఆఫ్‌టైప్, 100 నాణ్యత లేని, అంతగా దిగుబడి రాని మొక్కలుగా తేలాయి. పరిహారం కోసం ఆయిల్ ఫెడ్ అధికారులను సంప్రదిస్తే కొత్త మొక్కలు మాత్రమే ఇస్తామని చెప్పారు.

–చెలికాని సూరిబాబు, జగ్గారం, దమ్మపేట మండలం

నేనే సరిగ్గా సాగు చేయలేదన్నారు..



2018లో 12 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు మొదలు పెడితే ఐదేళ్ల అనంతరం దిగుబడి సమయాన 250 ఆఫ్‌టైప్ మొక్కలు ఉన్నాయని తేలింది. సూపర్‌వైజర్లు కూడా పరిశీలించారు. ఆ తర్వాత ఆయిల్ ఫెడ్ నుంచి స్పందన లేక హైకోర్టును ఆశ్రయించా. దీంతో నాకు న్యాయం చేయాలని సూచించింది. కానీ, నేను సరిగా సాగు చేయలేదంటూ రిట్ వేసినట్టు తెలిసింది.

–పుచ్చకాయల సోమిరెడ్డి, రైతు, నారాయణపురం, సత్తుపల్లి మండలం

కొత్త మొక్కలు ఇస్తున్నాం



ఆఫ్‌టైప్ మొక్కల ద్వారా నష్టపోయిన రైతులకు వాటి స్థానంలో కొత్త మొక్కలను ఉచితంగా అందజేస్తున్నాం. నేను ఈ మధ్యనే చార్జ్ తీసుకున్నాను. ఆఫ్‌టైప్ మొక్కలు వచ్చినట్లు ఇప్పుడిప్పుడే నా దృష్టికి వస్తోంది. కానీ, ఆఫ్‌టైప్ మొక్కలకు నష్ట పరిహారం ఇవ్వాలనే అంశంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఇది నా పరిధిలోనిది కాదు.

–నాయుడు రాధాకృష్ణ, నర్సరీ ఇన్‌చార్జ్, అశ్వారావుపేట

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి..



వైద్యులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్

మణుగూరురూరల్: విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. శుక్రవారం మండలంలోని గుట్టమల్లారం గిరిజన సంక్షేమశాఖ ఇంగ్లిష్ మోడల్ పాఠశాలను, పగిడేరులోని ఎస్టీకాలనీలో గల జీపీఎస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో బోర్డ్‌పై అక్షరమాల, అధికారుల పేర్లను రాయించారు. అక్షరాలు రాయడం, చదవడం, ఇంగ్లిష్ పదాలు పలకడంలో విద్యార్థులు వెనుకంజలో ఉన్నారని, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏటీడీఓ అశోక్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

మణుగూరురూరల్: మండలంలోని పగిడేరు గ్రామంలో ఐటీడీఏ సహకారంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరానికి మొత్తం 524 మంది హాజరు కాగా.. జనరల్ ఫిజీషియన్, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, పిల్లలు, కంటి, స్త్రీ సంబంధిత వ్యాధి నిపుణులు ప్రజలకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పలువురికి రక్త పరీక్షలు, 52 మంది గర్భిణులకు స్కానింగ్, 83 మందికి కంటి పరీక్షలు చేయగా.. 46 మందికి ఎక్స్‌రే తీశారు. వైద్యశిబిరాన్ని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ సందర్శించారు. కార్యక్రమంలో డీఐఓ బాలాజీనాయక్, మణుగూరు పీహెచ్‌సీ వైద్యుడు నిశాంత్‌రావు, వైద్యులు సాత్విక, సంజీవరావు, విజయ్, రాజశేఖర్, విక్టర్, ఖిల్లా, శైలేశ్, సిబ్బంది పాయం శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, లింగ్యానాయక్, రాముడు, రవి, వెంకన్న, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ లేకున్నా రిజిస్ట్రేషన్లకు ఓకే..

- రిజిస్ట్రేషన్‌తో పాటే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేలా మార్గదర్శకాలు
- ఎన్నికల కోడ్ ముగియగానే అమలు

ఖమ్మంమయూరిసెంటర్: 2020 ఏడాదికి ముందు అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం ఎల్‌ఆర్‌ఎస్ కింద 2020లో దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు రిజిస్ట్రేషన్ సమయాన ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతులు లేకుండా వేసిన వెంచర్లలో పది శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయి ఉంటే లింక్ డాక్యుమెంట్లతో పని లేకుండానే రిజిస్ట్రేషన్ చేసేలా ఈ ఉత్తర్వుల్లో పొందుపరిచారు. అంతేకాక ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్, ఫీజు వసూలు అంశాలపై ప్రభుత్వం ఉత్తర్వులతో పాటు ప్రత్యేక మాడ్యూల్ సైతం విడుదల చేసింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 2020 ఏడాది కంటే ముందే వేసిన వెంచర్లల్లోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి.



ఎన్నికల కోడ్ ముగియగానే..

ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. దీంతో ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాయితీ ప్రకటించినా ఇంకా అమల్లోకి రాలేదు. కోడ్ ముగిశాక రాయితీ అమల్లోకి వస్తుందని, ఆపై 2020 ఏడాదికి ముందు వేసిన వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు నేరుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని చెబుతున్నారు. తద్వారా రిజిస్ట్రేషన్ సంఖ్యతో పాటే ప్రభుత్వానికి ఆదాయం పెరగనుంది.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

పాల్వంచ: మోటార్ సైకిల్‌పై గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని సంజయ్‌నగర్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా.. బైక్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. తనిఖీ చేయగా వారి వద్ద రూ.3.90 లక్షల విలువ చేసే 7.8 కేజీల గంజాయి దొరికింది. పట్టుబడిన వ్యక్తులు సికింద్రాబాద్‌కు చెందిన అభిరామ్, చంద్రశేఖర్‌గా తేలగా.. వారు సీలేరు ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది రమేశ్, రాజశేఖర్, వేణు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చోరీ నిందితుడి అరెస్ట్

జూలూరుపాడు: మాచినేనిపేటతండాకు చెందిన బానోత్ బాలు ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ బాదావత్ రవి కథనం ప్రకారం.. ఈ నెల 25వ తేదీ రాత్రి బాలు ఇంట్లోకి ఖమ్మం నగరం అగ్రహారం కాలనీకి చెందిన ఎస్కే నదీమ్‌పాషా ప్రవేశించి బంగారం, నగదు అపహరించాడు. శుక్రవారం స్థానిక ఉప మార్కెట్ యార్డు సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీసులను గమనించిన నదీమ్‌పాషా ఆటోతో పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు వెంబడించి పట్టుకొని, విచారించగా తానే చోరీ చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి రూ.5 వేలు నగదు స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రవి వివరించారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారులు

చర్ల: రబీలో పంటలు సాగు చేసిన రైతులు తాలిపేరు ప్రాజెక్టు నీటిని సమన్వయంతో సక్రమంగా వినియోగించుకోవాలని తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టు ఈఈ రాంప్రసాద్ సూచించారు. ప్రాజెక్టు రెండో జోన్ పరిధిలోని పొలాలలకు సాగునీటిని విడుదల చేస్తుండగా చివరన గల పొలాలకు సాగునీరు అందకపోవడంపై రైతులు ప్రాజెక్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. రెండో జోన్ పరిధిలో లేనప్పటికీ కొన్ని చోట్ల పంటలు సాగు చేసిన రైతులు తాలిపేరు సాగునీటిని అక్రమంగా వినియోగిస్తున్నారని, తాము తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాలిపేరు ప్రాజెక్టు ఈఈ, డీఈ, ఏఈ, జేఈలు రైతులతో కలిసి అనధికారికంగా సాగునీటిని వినియోగిస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. ప్రాజెక్టు అధికారులతో కలిసి ఆయకట్టు రైతులు తాలిపేరు ప్రాజెక్టును కూడా సందర్శించి నీటి నిల్వను, ఇన్‌ఫ్లోను పరిశీలించారు. నీటిని తోడేందుకు వినియోగిస్తున్న ఆయిల్ ఇంజన్లు, మోటార్లు, పైపులైన్లను వెంటనే తొలగించాలని సంబంధిత రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఈఈ రాంప్రసాద్ మాట్లాడుతూ.. తాలిపేరు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గిందని, ప్రస్తుతం ఉన్న నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ తిరుపతి, ఏఈలు ఉపేందర్ పాల్గొన్నారు.

పెళ్లి అన్నాడు, పాప పుట్టాక కాదన్నాడు...

- యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

తిరుమలాయపాలెం: అప్పటికే ఒకరి చేతిలో మోసపోయిన ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించిన దగ్గరి బంధువు పాప జన్మించాక ముఖం చాటేయడంతో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుమలాయపాలెంకు చెందిన యువతికి నాలుగేళ్ల క్రితం క్రితం వివాహం జరగగా, 16 రోజులకే భర్త మరో మహిళతో వెళ్లిపోయాడు. దీంతో ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటూ జీవనం సాగిస్తోంది. రెండేళ్లుగా ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడుకు చెందిన మేనత్త కుమారుడు చిర్రా హరీశ్ వీరి ఇంటికి వచ్చివెళ్లే క్రమాన ఆమె అంటే ఇష్టమని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా దగ్గరయ్యాడు. దీంతో ఆమె గర్భం దాల్చి పాపకు జన్మనిచ్చాక తనతో ఎలాంటి సంబంధం లేదని, పాప తనకు పుట్టలేదంటూ హరీశ్ బుకాయించాడు. ఈక్రమాన ఆమె మూడు నెలల పాపను తీసుకుని హరీశ్ ఇంటికి వెళ్లగా ఆయనతో పాటు తల్లిదండ్రులు, సోదరి ఇంటికి రావొద్దని, వస్తే చంపేస్తామని బెదిరించారు. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ తెలిపారు.


ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్ మృతి



ముత్తేశ్ మృతదేహం

టేకులపల్లి: ట్రాక్టర్ పైనుంచి జారి.. ఇంజన్ కిందపడి డ్రైవర్ మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ బి.నరసింహారావు కథనం ప్రకారం.. మండలంలోని మద్రాస్‌తండాకు చెందిన మూతి ముత్తేశ్ (38) అదే గ్రామానికి చెందిన బాదావత్ హరిరామ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి కోయగూడెంలోని ఓ రైతు మిర్చి తోటలో పనిచేసిన మధ్యప్రదేశ్ కూలీలను ట్రాక్టర్‌లో తీసుకొస్తున్న క్రమంలో బావోజీతండా క్రాస్‌రోడ్‌లోని ముత్యాలమ్మ గుడి వద్దకు రాగానే ముత్తేశ్ అదుపుతప్పి ఎడమవైపు ఇంజన్ వెనుక టైర్ కింద పడ్డాడు. ట్రాక్టర్‌లో ఉన్న కూలీలు కేకలు వేస్తూ కొందరు కిందకు దూకేశారు. ఓ ఇద్దరు కూలీలు ధైర్యం చేసి ఇంజన్ మీదకు వెళ్లి బ్రేక్‌పై వేయడంతో పత్తి చేనులోకి వెళ్లి ఆగింది. ముత్తేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని టేకులపల్లి సీఐ సురేశ్ సందర్శించి, వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటో, బైక్ ఢీ : ఒకరు మృతి



బండ్ల శ్రీనివాసరావు మృతదేహం

బూర్గంపాడు: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఇరవెండి, మోతె గ్రామాల మధ్య ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న, అశ్వాపురానికి చెందిన బండ్ల శ్రీనివాసరావు (35)రోడ్డుపక్కన పొదల్లో పడిపోయాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. అయితే అతను అప్పటికే మృతిచెందాడు. మృతుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సారపాకకు చెందిన ఉషశ్రీతో అతనికి వివాహమైంది. వారికి మూడేళ్ల పాప, నెలరోజుల బాబు ఉన్నారు. సారపాకలోని అత్తగారింటికి వచ్చి తిరిగి మోటార్ సైకిల్‌పై అశ్వాపురానికి తిరిగి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. ఆటోడ్రైవర్, మరో ఇద్దరు ప్రయాణికులకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



భరత్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామ శివారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈర్ల భరత్ (20) మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామానికి చెందిన నర్సింహారావు, సుశీల దంపతుల రెండో కుమారుడు ఈర్ల భరత్ ప్రస్తుతం హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఖమ్మంలో ఉంటున్నారు. మూడు రోజుల కిందట స్నేహితుని పుట్టినరోజు వేడుక పేరుతో ఇల్లెందుకు వచ్చిన భరత్.. ఇతర స్నేహితులతో కలిసి లాడ్జిలో దిగినట్లు సమాచారం. మూడు రోజులు లాడ్జిలోనే గడిపిన భరత్ శుక్రవారం తెల్లవారుజామున బైక్‌పై టేకులపల్లికి బయలుదేరాడు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడటంతో పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే భరత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుడి దారుణ హత్య



మునిసింగ్ బిశ్వకర్మ (ఫైల్)

మణుగూరుటౌన్: ఓబీ కంపెనీలో పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కి చెందిన కార్మికుడిని గుర్తు తెలియని దుండగులు బండరాళ్లతో మోది, దారుణంగా హత్య చేసిన ఘటన శుక్రవారం మణుగూరులో వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. మధ్యప్రదేశ్ రాష్ట్రం సిద్ధి జిల్లా గోహరి గ్రామానికి చెందిన మునిసింగ్ బిశ్వకర్మ (42) స్థానిక ఓ ఓబీ కంపెనీలో మెకానిక్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గాంధీనగర్ చర్చ్ సమీపంలోని ఓసీ–4 దుర్గా ఓబీ కంపెనీ పాత డంప్ యార్డ్ వద్దకు బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తికి శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, పేకముక్కలు చిందరవందరగా పడేసి ఉండగా, అక్కడి మంచం నవారును మెడకు చుట్టి బండరాయితో తలపై మోది హత్య చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సోమ సతీశ్, ఎస్‌ఐలు సందర్శించి డాగ్ స్క్వాడ్ ద్వారా ఓబీ కంపెనీ గ్యారేజీలో తనిఖీ చేశారు. కంపెనీ ప్రతినిధి ముత్తుతో పాటు పలువురిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కంపెనీ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీశ్ పేర్కొన్నారు.

ముగ్గురు నిర్దోషులుగా తీర్పు

భద్రాచలంటౌన్: నకిలీ నోట్లు చెలామణి చేస్తున్నారనే అంశంలో ముగ్గురిపై కేసు నమోదు కాగా, విచారణలో నేరం రుజువు కానందున నిర్దోషులుగా భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి వి.శివనాయక్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. 2013లో ములకలపల్లి అశోక్, కొండసాని రాము, కత్తుల వెంకటేశ్వర్లుపై రూ.3 వేలు అసలు నోట్లు ఇస్తే రెట్టింపు నకిలీ నోట్లు ఇస్తామని చెప్పారనే అభియోగంపై కేసు నమోదైంది. ఈ మేరకు భద్రాచలం టౌన్ పోలీసులు చార్జీషీట్ దాఖలు చేయగా, విచారణలో నేరం రుజువు చేయలేకపోవడంతో వీరిని నిర్దోషులుగా తీర్పు చెప్పారు.

ఇసుక లారీ సీజ్

ములకలపల్లి: అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. జగన్నాథపుర వైపు ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు శుక్రవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. కంపగూడెం క్రాస్ రోడ్డు వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.